# నిన్నటి హిమపాతం

"మొన్న కమల కన్పించింది ఆర్‌టిసీ ఆఫీసులో. ఓ చిన్న ఆఫీసరు."

"కమలెవరు?"

"అదేరా మన క్లాసుమేటు. ఐదు నుండి థర్డ్ ఫాం దాకా మన క్లాసులోనే ఉండేది."

"అవును. గుర్తుకొచ్చింది. నీకెలా తెల్సు, ఆమె అక్కడ పని చేస్తున్నదని?"

"ఏదో పనిమీద వెళ్ళాలే. కబుర్లు చెప్తుంటే మంగళగిరి ప్రస్తావన వచ్చింది. నేనా స్కూల్లో చదివానని చెప్పా. తనూ అక్కడే చదివానంది. ఏ సంవత్సరం వగైరా వివరాలడిగాక, మన క్లాసుమేటే అని నిర్ధారణ అయింది. గుర్తు పట్టటం కష్టమయింది."

గుర్తు పట్టటం కష్టమే మరి! ఇప్పుడా, ఎప్పటి మాట? నలబై, నలభయ్యాయి దేళ్ళయింది, తాము మంగళగిరి చింతక్రింది కనకయ్య హైస్కూల్లో చదివి. ఆమె అప్పుడు ఫ్రాకులు వేసుకు వచ్చేది. రెండు జడలు. సన్నగా ఉండేది. చామన చాయ. పల్చటి ముఖం. థర్డ్ ఫాం తర్వాత వాళ్ళ నాన్నకు విజయవాడ కాబోలు ట్రాన్స్ఫరయింది. మళ్ళీ ఆమెని చూడలేదు. పెరిగి పెద్దదై, పిల్లల తల్లయి, జీవితంలో సంధ్యాకాంతులు ప్రవేశిస్తున్న వేళ ఆమె ఎలా ఉంటుందో? పేరును బట్టేగానీ, మనిషిని చూసి గుర్తు పట్టటం సాధ్యమయే పని కాదు.

" రేపు సాయంత్రం వస్తావా, నేను ఆర్‌టిసీ ఆఫీసుకెళ్ళాలి. నువ్వెలా వున్నావని కూడా ఆమె అడిగింది. ఆమెని కలుద్దాం."

"అట్లాగే. నువ్వు వెళ్ళేముందు ఫోను చెయ్యి" అన్నాను.

నరశింహా రావు వెళ్ళిపోయాడు. అంతే, మళ్ళా కన్పించలేదు అతను. బజార్లో కలిశాడు. మాటలయ్యాయి. కమల సంగతి చెప్పాడు. వరంగల్లులో కాబోలు ఉంటున్నానన్నాడు. ఫోను నంబరు ఇచ్చాడు. మాయమయాడు. ఫోను చేస్తే అలాంటి వ్యక్తి ఎవరూ ఇక్కడ లేరన్నారు. కమల ఏ ఆఫీసులో పని చేస్తుందో నేను తెల్సుకోలేదు.

ఆ తర్వాత ఒకసారి ఒకావిడెవరో తనకు న్యాయం చెయ్యమంటూ నా దగ్గరకు వచ్చింది.

"వెళ్ళు, వెళ్ళు. నువ్వెవరో నాకు తెలీదు. కొత్తదానివి. పరిచయం లేనిదానివి" అన్నాను.

"నేనండీ, బాబూ! కమలని, గుర్తు పట్టలా?"

నాకు భయమేసింది. "ఏ కమల?" అడిగాను.

"మీ బామ్మర్ది బామ్మర్ది పెళ్ళాన్ని. 'ఒసే, మనవి తనువులు వేరయినా మనసొకటే. మనకు ఎడబాటు లేదు' అన్నాడా? మనిషి మోసం చేశాడు."

"ఎవరన్నారు, ఎవరు మోసం చేశారు?"

"నేను ఎట్టాంటి మసిషనుకున్నారు! నిప్పండీ, నిప్పు!"

"నేనేమనుకోలేదు. మరి వస్తా."

"అట్లా అర్ధాంతరంగా మీరూ వెళ్లిపోతే ఎట్లా, మా ఆయన లాగా?"

నేను అయోమయంగా ఆమె వంక చూశాను.

"అట్లా అన్నవాడు, చెప్పా చెయ్యకుండా చచ్చి శవ మయ్యాడా? అది మరి మోసం కాక మరేమిటి? అహ, మీరు చెప్పండి......"

'మరి ఛస్తాడా?' అనుకున్నాను, ఆమెనుండి పారిపోయి వచ్చి అలుపు తీర్చుకుంటూ.

ఒకందుకు సంతోషమేసింది– ఆ అసభ్య స్త్రీ నా బాల్య స్నేహితురాలు కానందుకు. నా ఆలోచనల్లో ఉన్న ఆ అందమైన అమ్మాయిని వయసుతో పాటు వచ్చే వృద్ధాప్యపు నీలి నీడలు చుట్టుముట్టే ఉంటాయి. ఆమె అలాగే నా ఊహల్లో ఉన్నట్టే బాలికలా ఉండిపోవాలి. ఇంక నేను ఆమెని కలుసుకునే ప్రయత్నం చెయ్యను. అలా ఆమె కూడా కాలగర్భంలో కలిసి పోయింది.

ఇలా ఏంతమంది జీవితంలో తారసపడి మాయమయారు! వాళ్ళల్లో నామనస్సుకు దగ్గరగా వచ్చినవాళ్ళుకూడా ఉన్నారు. మసక మసకగా ఒక్కొక్కళ్ళూ కనపడి తప్పుకు పోసాగారు.

మా ఊరు, చిన కాకాని గుర్తుకు వచ్చింది. మా ఊరు నుండి రోజూ నాలుగు మైళ్ళు నడచి, మంగళగిరి వెళ్ళి హైస్కూలులో చదువుకునే వాళ్ళం. మా ఊళ్ళో ప్రాథమిక పాఠశాల ఉండేది. అక్కడ ఏ క్లాసు దాకా చదువుకున్నానో గుర్తు లేదు. మంగళగిరి

హైస్కూలులో ఐదో తరగతిలో చేర్చారు మా వాళ్ళు. మా ఊరు స్కూల్లో చదువుకునే రోజుల్లో ఓ మిత్రుడు ఉండేవాడు. వాడి పేరు వీరయ్య. మనిషి నల్లగా, బండగా ఉండేవాడు. స్కూల్లో కలిసి చదువుకున్నామన్న గుర్తే కానీ ఏ క్లాసో ఏమో. ఏడెనిమిదేళ్ళ వయసు లోనే వాడి చదువు మానిపించారు. ఉప్పరి పనిలో పెట్టారు. ఆ తరువాత వాడు కలవలేదు. ఓసారి నాకు పన్నెండు, పదమూడేళ్ళప్పుడు – అప్పటికి మేం మంగళగిరిలో సెటిలయాం – మా ఊరు వెళ్ళినప్పుడు వాడు కలిశాడు. ట్రంకు రోడ్డునుండి చెరువు కట్ట పక్కగా వేసిన రోడ్డు మీద సైకిలు తొక్కుకుంటూ వస్తూవుంటే, మర్రి చెట్టు ఇంకా ఒక ఫర్లాంగు దూరంలో ఉందనగా వాడు కన్పించాడు. మనిషి పొడుగ్గా, బలంగా, వయసుకు మించిన దార్ఢ్యంతో కనిపించాడు. నలుపు. అమాయకమయిన, కళ గల ముఖం. తల మీద బండెడు వంకీల జుట్టు. లోపల బనీను,చేతులు మడచిన లాల్చీ, పైకి ఎగగట్టిన ధోవతి. బట్టలు మాసి ఉన్నాయి. కాళ్లకు చెప్పులు లేవు.

"ఏం సదువుతున్నా?" అడిగాడు.

చెప్పాను. నవ్వాడు వాడు. చాల సమ్మోహనమైన నవ్వు అది. నేను చదువు తున్నందుకు సంతోషం.

"రారా, ఎళ్దాం" ఎవరో పిల్చారు. బహుశః పనికి కాబోలు.

"వత్తా" అని వెళ్ళిపోయాడు.

ఆ తరవాత నేను మళ్ళీ వాడిని చూడలేదు. ధనుర్వాతంతో చనిపోయాడు. ఆ పదిహేనేళ్ళ వీరయ్య రూపం నా మనసులో ముద్రితమై పోయింది. వాడికి ముసలితనం లేదు. ఆ నవ్వు ఇప్పటికీ నా మనసులో మెదులుతూనే ఉంటుంది.

మా ఊర్లోనే వీధిబడి మిత్రుడు, నీలకంఠం. పద్మసాలీలు. వాడు చదువులో పైకి వచ్చిన గుర్తులేదు. వాడి కంటే వాడి నాయన నాకు బాగా గుర్తు. నీలకంఠాన్ని కలవటానికి వెళ్తే, వీధిలో పడుగు వేస్తున్న మనిషి, నా తెలివిని పరీక్షించటానికన్నట్లు – తన కొడుకు చదవకా, నేను చదివీ ఒకటే అన్నట్టు నాకు ఓ నోటి లెక్క సంధించేవాడు: "పంతులూ! సవాశేరు మినుములు మూడణాల ఏగానీ అయితే, నాలుగు మానికల మినుములు ఎంత?" అంటూ. నేను ఎప్పుడు కనిపించినా నాకోసం ఇట్టాంటి ప్రశ్నఒకటి సిద్ధంగా ఉండేది. నాకు లెక్కలసలే రావు. నేను నోరు వెళ్ళబెడితే సంతోషించేవాడు. నేను సిగ్గుతో చిమిడిపోయేవాడిని. అందుకని వాడి స్నేహం మానేశాను. వాళ్ళింటికి వెళ్ళి రోజూ అవమానాల పాలవటం కష్టం కదా!

తరవాతి వాడు శేషగిరి. వాడిని గురించి ఎప్పుడు తలుచుకున్నా నా మనసు ఆర్ద్రమవుతుంది. మంగళగిరిలో నాతో పాటు ఐదు, ఆరు, ఏడు తరగతులు చదువుకున్నాడేమో! బతుకు కష్టం. వాళ్ళకుటుంబం గురించి నా కంత బాగా తెలియదు. చదువు మాన్పించి వాడిని ఓ బట్టలకోట్లో పనివాడు – ఇప్పటి పరిభాషలో సేల్స్‌మన్ – గా పెట్టారు. నేను చిన్నప్పటినుండీ పిరికివాడిని. నా కెప్పుడూ ఎవరి అండ దండలో అవసరం. ఆ దశలో వాడు ఆ అవసరాన్ని పూరించేవాడు. నాకు ఇప్పటికీ బాగా గుర్తు. క్లాసులో ఎవడో నన్ను ఎగతాళి పట్టించాడు.కొట్టాడు కూడానేమో? శేషగిరి నా బదులు వాడిని ఉరికించి ఉరికించి కొట్టాడు. ఆ తరవాత ఆ పిల్లవాడు తన్ను కొట్టాడని ఫిర్యాదు చేస్తే, మాట్లాడకుండా మాష్టారు చేత తన్నులు తిన్నాడు. స్కూల్లో ఉండగా 'హి ఫాట్ మై బాటిల్స్ ఫర్ మి.'

వాడు చదువు మానేశాక కూడా నా స్నేహం వదలలేదు. ఆ వయసులోనే సంపాదన పరుడు కనుక ఇద్దరం కల్సి రెండో ఆట సినిమాకు వెళ్ళేవాళ్ళం. టికెట్టు ఖర్చు వాడిదే. మొదటి ఆట సినిమా వెళ్ళటానికి కుదరదు వాడికి. షాపు కట్టేసేటప్పటికి తొమ్మిది దాటిపోయేది. తెల్లటి నాలుగుడ్డ లాల్చీ, పైజమా ధరించేవాడు. ఆ తరవాత నేను చదువుకు గుంటూరు, ఆ మీదట హైదరాబాదు వెళ్ళాను. వాడిని కలిసిన సందర్భాలు తక్కువ. కలిసినప్పుడు కూడా తన సంసారం గురించి గానీ, తన కష్టాల గురించిగానీ వాడు మాట్లాడగా నేను వినలేదు. చేసేది చిన్న ఉద్యోగం. వచ్చే రాబడి తక్కువ. ఆదాయం, ఖర్చు ఎలా నిర్వహించుకో గలిగేవాడో నాకు తెలియదు.

"ఉంటావా, రెండు రోజులు? సినిమాకు వెళ్దాం" అనేవాడు శేషగిరి.

"ఉంటా" అనేవాడిని.

సినిమా కాదు ముఖ్యం. వాడిపక్కన, వాడి మాటలు వింటూ కాలం గడపటం నాకిష్టం. విజయలక్ష్మీటాకీసులో సినిమా. అదొక్కటే సినిమాహాలు ఆ ఊళ్ళో, ఆ రోజుల్లో. అయితే, నేను మంగళగిరిలో చదువు పూర్తి చేశాక మేమిద్దరమూ కలిసి చూసిన సినిమాలు తక్కువ. సుమారు నాకు నలభైయేళ్ళు వచ్చేదాకా అప్పుడప్పుడు నేను మంగళగిరి వెళ్ళినప్పుడల్లా వాడిని కలిసేవాడిని. నేను చివరిసారిగా వెళ్ళినప్పుడూ సినిమా చూశాం. అయితే నాకు తెలియందేమంటే, వాడు పనిచేసే బట్టలకొట్టు యజమాని చనిపోయాడనీ, ఆ షాపు ఎత్తేశారనీ. ఆ విషయం నేను మంగళగిరి నుండి తిరిగొచ్చాక విన్నాను.

"అక్కయ్యవాళ్ళింట్లోనే కదా దిగింది? నేను ఆరింటికల్లా వస్తాను. ఇద్దరం కల్సివెళ్దాం" అన్నాడు, బజార్లో కలసి.

"నీకు షాపు లేదూ? పని మానెయ్యటమెందుకూ? సెకండ్ షోకు వెళ్దాము. విజయలక్ష్మిలోనేగా? నేనొస్తాలే రాత్రి తొమ్మిదింటికి" అన్నాను.

"అక్కడ పాత సినిమా ఆడుతోంది. కొత్తదానికెళ్దాం, మొదటాటకి. ఆరింటికి నేనే వస్తాగా" అని హడావుడిగా వెళ్ళిపోయాడు.

వాడు ఐదింటికే వచ్చాడు. కాఫీ తాగుదామన్నాడు. టిఫెను తిన్నాం, కాఫీ తాగాం. నన్ను జేబులో చెయ్యి పెట్టనివ్వలేదు వాడు. సినిమాకు వెళ్ళాం. టిక్కెట్టు దొరకలేదు.

"ఇప్పుడే వస్తానుండు" అని వెళ్ళాడు.

నాకర్థమైంది, వాడు బ్లాకులో టిక్కెట్లు తేవటానికి వెళ్ళాడని. రెండు టిక్కెట్లతో తిరిగి వచ్చాడు

"ఎంత చిలుము వదిలించుకున్నావేం?" అనడిగాను.

"ఎంతయితే ఏం? నువ్వు మళ్ళీ ఎప్పుడు కలుస్తావో ఏమో?"

"నువ్వు హైదరాబాదు రాకూడదూ? రెండు రోజులు కలసి ఉండొచ్చు."

"అది అయ్యే పని కాదులే" అని నవ్వాడు.

మర్నాడు గుంటూరుకు ట్రయినులో వెళ్తాంటే శీను కలిశాడు. వాడూ నాతో కల్సి స్కూలులో చదివాడు. వాడూ నన్ను చూసి సంతోషపడి పోయాడు."ఊళ్ళోకి వచ్చినవాడివి కలిసిపోతేనేం?" అన్నాడు శీను.

"ఏదిరా! నిన్నొక్క రోజేగా ఉంది. నిన్న శేషగిరితో సినిమాకు వెళ్ళాను" చెప్పాను.

"అట్లా చెప్పు. అందుకే కాబోలు అర్జెంటు అని చెప్పి రెండొందలు పట్టుకెళ్ళాడు, వెధవ! మాట నిలబెట్టుకునే వాడే. ఇప్పుడు మాత్రం కష్టం. ఉద్యోగం లేదు. సేటు చనిపోయాడు. కొడుక్కు బట్టల వ్యాపారం చేసేఉద్దేశం లేదు. షాపు అమ్మేశాడు. ఎట్టా బతుకుతున్నాడో ఏమో?" అన్నాడు శీను.

"నాకా విషయం చెప్పలేదే? పైగా ఖర్చంతా వాడే పెట్టుకున్నాడు."

"వాడంతే. కష్టాలూ, బాధలూ వాడి సొంతం. అందరితో పంచుకోవాల్సింది ఆనందమని వాడి ఉద్దేశం."

తరవాత నేను మంగళగిరి వెళ్ళిందీలేదు, వాడిని కలిసిందీలేదు. నలభయ్యేళ్ళ పైబడ్డాక చేసే నౌకరీ పోతే జీవితం దుర్భరం. ఉద్యోగం దొరకటం కష్టం. దొరికినా తను

మొదటినుండీ చేసిన ఉద్యోగంలో దొరికినంత జీతం దొరకటమూ కష్టమే. ఎలా బతికాడో నాకు తెలియదు. నేను మళ్ళా వాడిని కలవలేక పోయాను. ఉన్నాడో, పోయాడో.

అలా నేను ఆలోచనల్లో మునిగిపోయి ఉన్నప్పుడు, ఫోను గణగణా మోగింది. రిసీవరెత్తాను.

"నేనండీ మాధవరావుగారి రెండో అబ్బాయిని. మా నాన్న నిన్న రాత్రి గుండెపోటుతో మరణించారు. రేపు దహనం..."

"అయ్యయ్యో! ఎంత పని జరిగింది! వారం రోజుల క్రితం వాడిని చూశాను. ఒంట్లో బావుండలేదని నాతో ఒక్క మాట అనలేదు.... సరే, రేప్పొద్దున వస్తాను."

మేమిద్దరం ఉద్యోగం చేస్తూ చదువుకున్నాం. వివి ఈవినింగ్ కాలేజీలో బిఏ చేశాం. రైల్వే ఉద్యోగం. రకరకాల డ్యూటీలు. వాడు అప్పటికే గృహస్థు. నాకింకా పెళ్ళికాలేదు. పరీక్ష లొచ్చినప్పుడు శలవు పెట్టి వాడింట్లోనే చదువుకునేవాళ్ళం. వాడి పక్కింట్లో ఓ అందమయిన అమ్మాయి ఉండేది. పేరు సురుచి. వయసు తమకం. మాటలు కలుపుకున్నాను. ఆమె కూడా నన్ను ప్రేమించానంది. ఆ రోజు నేను వాడింటికి వెళ్ళేటప్పటికి పెద్దగోలవుతున్నది.

"అడుగో, వచ్చాడు నాకొడుకు! గుంజకు కట్టేసి నాలుగు తగలనివ్వండి. ఒంటి మదం అణగిపోతుంది"అన్నాడు ఓ వ్యక్తి.

ఇద్దరు లేచారు, నన్ను పట్టికట్టెయ్యటానికి.

అప్పుడు లేచాడు మాధవుడు, "వాడి ఒంటిమీద చెయ్యిపడిందా, శవాలు లేచి పోతాయి!" అన్నాడు హుంకరిస్తూ.

అంతే, ఎవడికీ నన్ను తాక దమ్ము లేక పోయింది.

"మీ అమ్మాయికి పెళ్ళయిందని నాకే తెలీదు, వాడి కెట్లా తెలుస్తుందయ్యా! పెళ్ళయిన పిల్ల బుద్ధిగా కాపురం చేసుకోక – ప్రేమించాను, లేచి పోతాను అంటుందా? మా వాడికి పెళ్ళి కాలేదు. మీపిల్లకు పెళ్ళికానట్లయతే చేసుకునే అన్ని అర్హతలూ వాడి కున్నయ్! ఇప్పుడు తెలిసిందిగా, మీ అమ్మాయికి పెళ్ళయిందని! ఆ పిల్లని కట్టుదిట్టం చేసుకోండి. మా వాడు మీ పిల్లవంక చూడడు. నాదీ హామీ" అన్నాడు వాడు, ఆగండం గడిపేస్తూ.

తమ పిల్ల దగ్గర తప్పు ఉండటంతో వాళ్ళుమారు మాట్లాడకుండా వెళ్ళిపోయారు. వాళ్ళనలా వెళ్ళనిచ్చిఇంక నన్ను చెడతిట్టాడు, "బుద్ధి లేదట్రా, వెధవా! పెళ్ళయిన పిల్లతో ప్రేమకలాపాలేమిట్రా?" అంటూ.

"ఆమెకు ఆ మొగుడంటే ఇష్టంలేదు..."అని నసిగాను.

"నువ్వామెను ఉద్ధరించ బయలుదేరావా? తెలివిగలవాడివి, పైకి చదివి పెద్ద ఉద్యోగం చేస్తావనుకుంటే నువ్వు చేసే పన్లు ఇవా? పైగా ఇక్కడ ఉండి...?"

"అన్నదేం తప్పులేదు, అది జగజ్జంత్రీ, వేషాలేసేది..." అని భార్య ఏదో చెప్పబోతే ఆమెను కసిరాడు.

"ముయ్యినోరు! మనం ఫస్టుకు ఇల్లుమారుతున్నాం. వాళ్ళనాయనతో మాట్లాడి ఆ పిల్లని కాపురానికి పంపించే ఏర్పాటు చేస్తాను..."

"నాకోసం నువ్వు ఇల్లుమారటమెందుకూ? నేను మీఇంటికి రావటం మానుకుంటాలే" అన్నాను.

"చంపుతా వెధవా? పిచ్చి వాగుడు వాగకు... నేను పోయాక నా ఇంటికి రావటం మానెయ్."

వాడనుకున్నట్లే చేశాడు. ఫస్టుకు ఇల్లుమారాడు.

ఆ తరవాత నేను ఎంఏ చదవటానికి వెళ్తే, వాడు లా చదివాడు. నేను తరవాత కాలేజీలో చేరాను, వాడు లాయరు ప్రాక్టీసు పెట్టాడు. మార్గాలు వేరయాయి. కలవటం తక్కువయింది. వాడు జీవితంలో ఎన్నో దెబ్బలుతిన్నాడు. ప్రాక్టీసు అంత బాగా ఉండేది కాదు. తాగుడు అలవాటయింది. అశ్వమేధయాగాలూ చేసేవాడని విన్నాను. చేతికెక్కి వచ్చిన కొడుకు, మంచి ఉద్యోగం చేసేవాడు, తండ్రిని అనుకరించి తాగితాగి చచ్చాడు. అదోపెద్ద మనస్తాపమైంది మాధవుడికి. నాతో కలవటం మానేశాడు. జీవితంలో దారులు వేరవటంతో, నా వ్యస్తతలోనేనూ వాడిని కలుసుకోలేక పోయాను.

అలాంటి వాడిని యేళ్ళతర్వాత మళ్ళీ కలిసి రెండు నెలలే అయింది. తాగుడికి బానిస అయ్యాడని వాళ్ళూవీళ్ళూ చెప్పగా విన్నాను. "ఏందిరా, విపరీతంగా తాగుతున్నావని రమణ అన్నాడు" అని అడిగాను.

"వాడి ముఖం! ఎప్పుడయినా మనసు బాగుండకపోతే ఓచుక్కేసు కుంటాను" అని జవాబిచ్చాడు. ఓ గంట సేపు పాత ముచ్చట్లు చెప్పుకునేవాళ్ళం. ఆ తరువాత మాటలు కరువయ్యేవి.ఎవరి తోవన వాళ్ళం వెళ్ళ తహతహ పడేవాళ్ళం. ఇంక మాటలే లేకుండా పోయాడు వాడు.

మర్నాడు మాధవుడి అంత్యక్రియలకు వెళ్ళివచ్చాను. మనసు కలతబారి పోయింది.

వీరయ్యకు ముసలితనంలేదు. వాడు పదిహేనేళ్ళ నూనూగు మీసాలు అప్పుడే మొలుస్తున్న కుర్రాడిలా నిలచిపోతాడు. శేషగిరిని నేనెప్పుడూ ముసలివాడుగా చూడలేదు. స్కూల్లో చదివేటప్పుడు ఎలా ఉండేవాడో, నలభయ్యేళ్ళ వయసులోనూ వాడలాగే ఉన్నాడు. మాధవుడు పోయాడు. జీవిత ప్రస్థానంలో ఎందరు మిత్రులు! చాలా మంది దూరమయి పోయారు.

ఇప్పుడీ మనుషులంతా వస్తే బతికున్నవాళ్ళు ఉన్నట్టుగానూ, చచ్చినవాళ్ళు బతికీ వస్తే నేను భరించగలనా? వీళ్ళు నా ఊహల్లోని నా వాళ్లు కాదు. వీళ్ళు కొత్తవాళ్ళు. వీళ్ళు నా స్నేహితులు కాదు. స్నేహం కూడా ఒట్టిగా పుట్టదు. దానికి ఆలంబన కావాలి. అది ఒక జాగాలో పనిచేసే అవకాశం కావచ్చు, కొన్నిఅభిరుచుల సాన్నిహిత్యం కావచ్చు, మరేదో కావచ్చు. ఆలంబనం లేకుండా అది బతికి బట్టకట్టదు. ఈ భౌతిక పరిస్థితుల్లో మార్పులు వస్తే స్నేహం భూతకాలానికి చెందింద్దై పోతుంది. మిత్రులు కొత్తవాళ్ళై పోతారు. ఒకప్పుడు గంటల తరబడి మాట్లాడుకునే మిత్రులు భౌతిక పరిస్థితుల మార్పులతో కలసినప్పుడు మాటలే కరువవుతాయి. పాత స్నేహితులు విడిపోయాక మళ్ళా మానసికంగా కల్సుకోటం తేలిగ్గాదు. స్నేహానికి పునర్నవీకరణం అంత తేలిగ్గాదు. మనిషి మానసిక జీవి. స్నేహానికీ టైమ్, స్పేస్‌లు రెండూ ఉన్నాయి. అప్పటి స్నేహపు హిమం కరగి పోయింది. ఇప్పుడు వాళ్ళు కలిసినా పలకరించి వదిలించుకోటమే అవుతుందేమో!

ఇలా నేను ఆలోచనల్లో మునిగి ఉంటే ఒళ్ళో నా వేళ్ళతో ఆడుకుంటున్న మనవడు ఎందుకో పకపకా నవ్వాడు. నా కొడుకూ, కోడలూ అమెరికాలో ఉంటారు. వాళ్ళివ్వాళ తిరిగి వెళ్ళిపోతున్నారు. మా కోడలు పిల్లవాడిని నా దగ్గరనుండి తీసుకోటానికి వచ్చింది. వాళ్ళు ఎయిర్ పోర్టుకు వెళ్ళటానికి పిల్చుకున్న టాక్సీ రెడీగా ఉంది. వాళ్ళిక్కడున్న నెలరోజుల్లో పిల్లవాడు నాకు బాగా చనువయ్యాడు. నన్ను చూస్తూనే అవ్యాజంగా నవ్వుతాడు. వాళ్ళు మళ్ళా వచ్చేటప్పటికి ఏ నాలుగేళ్ళవుతుందో! అప్పటికి వాడు నన్ను గుర్తు పట్టడు. 'అప్పటి ఐదేళ్ళపిల్లవాడు ఇప్పటి నా ఏడ్నెల్ల మనవడు కాదు' అనుకుంటూనే పిల్లవాడిని కోడలు చేతికిచ్చాను.వాళ్ళు కారు ఎక్కారు. కొడుకూ, కోడలూ వీడ్కోలు చెప్పారు. కోడలి ఒళ్ళోనుండి పిల్లవాడు నా వంక చూసి నవ్వాడు. వాడి నవ్వులో నాకు విన్పించింది: 'పసిడి రెక్కలు విసిరి కాలం పారిపోయిన జాడలేవి?

ఏవి తల్లీ! నిరుడు కురిసిన హిమ సమూహములు.'

సంభ్రమంగా తిరిగి చూశాను. కారు వెళ్ళిపోయింది.

ఆంధ్రభూమి, ప్రియదర్శిని, *(2010 ఫిబ్రవరి 20)*